క్లుప్తంగా

పోషణ పక్షోత్సవ అవగాహన ర్యాలీ



గుంటూరు రూరల్: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పెదపలకలూరులో బుధవారం కె.ఎస్.ఆర్. నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీని నిర్వహించారు. ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ మనోరంజని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిరుధాన్యాలు, పోషణ, పౌష్టికాహార విలువల్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో దిశ లాయర్ ఏ. విజయలక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది, కెఎస్ఆర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ సంకీర్తన



బ్రాహ్మణకోడూరు (చేబ్రోలు): తెలుగు, సంస్కృతి సంప్రదాయాలకు ఉగాది పండుగ ప్రతీక అని ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షిత్ అయ్యంగార్ తెలిపారు. పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరులో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా కాషాయ జెండాలతో గ్రామ సంకీర్తన నిర్వహించారు. శోభకృతు నామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ ఆనందం, సుఖ సంతోషాలను కలిగించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, స్వామి కల్యాణం, పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు స్వామికి ముత్యాల అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త బృందం లలితా పారాయణం చేసింది. సాయంత్రం కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. అనంతరం వేద పండితులు, పురోహితుల సమక్షంలో స్వామి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చకులు స్వామి తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

నేడు విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై గురువారం వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముందుగా అంతర్జాతీయ కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో..

అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఉగాది పురస్కరించుకుని గురువారం పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారిణులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో మురుగుడు హనుమంత రావు కాలనీకి బుధవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేశారు. పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేశారు. అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ ఆధ్వర్యంలో పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించి సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించారు.

మెరుగైన విద్య, వైద్యం జగనన్న లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- జొన్నలగడ్డలో విలేజ్ క్లినిక్ ప్రారంభం, వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వైఎస్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సుచరిత, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని ప్రజల ఇంటి దగ్గరకే అందజేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని జొన్నలగడ్డలో బుధవారం నూతనంగా నిర్మించిన వైఎస్సార్ గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణను వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా గ్రామస్తులకు శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని ప్రారంభించారని తెలిపారు. జొన్నలగడ్డలో ఎంపీపీ పులగం దివ్య భర్త శ్రీనివాసరెడ్డి రూ. 25 లక్షలు విలువ చేసే స్థలాన్ని ప్రభుత్వానికి ఇవ్వడంతో పాటు అందులో తల్లిదండ్రుల పేరిట విలేజ్ క్లినిక్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో జగనన్న విప్లవాత్మక మార్పుల్ని తెచ్చారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ త్వరలో గ్రామంలో చెరువుకు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించాల్సిన రైతు భరోసా కేంద్రానికి స్థలాన్ని దానంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వంగా నవీన్‌రెడ్డిని అభినందించారు.సమష్టిగా కృషి చేస్తే గ్రామాభివృద్ధి సులువుగా జరుగుతుందని సూచించారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పులగం దివ్య, పులగం శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైఎస్ ఎంపీపీలు దర్శి సుజాత, ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ



వేదికపై హనుమాన్ చాలీసా పారాయణ

తెనాలి: ఉగాది పర్వదినాన పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్యాత్మిక వేడుకకు వేదికైంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన ఉగాది వేడుకల్లో భాగంగా తొలుత ములుకుట్ల విశ్వనాథశర్మచే పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం 'సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం' సాగింది. వేదికపై హనుమత్ సమేత సీతారామలక్ష్మణ విగ్రహాలకు పూజించి కార్యక్రమాన్ని ఆరంభించారు. శ్రీహనుమాన్ సేవాసమితి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం వేదికపై హనుమాన్ చాలీసా పారాయణ చేయగా, ప్రాంగణంలోని 1108 మంది భక్తులు గళం కలిపారు. వీరిలో అత్యధికులు మహిళా భక్తులే ఉన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేకంగా హాజరయ్యారు. తులసీదాస్ స్వరపరిచిన నలభై శ్లోకాలే హనుమాన్ చాలీసాగా ఆయన చెప్పారు. ఇవన్నీ ద్విపదలో ఉంటాయన్నారు. హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఎంతోకాలంగా ఒక యజ్ఞంగా నిర్వహిస్తూ సమాజంలో ఆధ్యాత్మిక భక్తిభావనలు వెల్లివిరిసేలా కృషిచేస్తున్న శ్రీహనుమాన్ సేవాసమితిని ఎమ్మెల్యే శివకుమార్ అభినందించారు. జ్యోతిని వెలిగించిన శ్రీహనుమాన్ సేవాసమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. దుష్టశక్తులను దూరం చేస్తాయనీ, శని గ్రహ ప్రభావం తగ్గుతుందనీ, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే శక్తినీ, ధైర్యాన్నీ కలిగిస్తుందని చెప్పారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దేవస్థానం పాలకవర్గ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, తెనాలి అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ధాకా సాంబిరెడ్డి, చుండూరు సాయి, మద్దాళి శేషాచలం, చుండూరి వెంకట శివప్రసాద్, భాస్కరుని లక్ష్మీనారాయణ, రావూరి సుబ్బారావు, కఠారి హరీష్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడు శ్రీనివాసకాలనీలో బుధవారం రూ 1.11 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరంలో శివారు గ్రామాలు విలీనమైన తరువాత 15 ఏళ్లపాటు ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీల రూపురేఖలు మారిపోయాయని, కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వసతులు, విద్యుత్ వంటి సకల సౌకర్యాల్ని కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ఎల్లయ్య, వెంకట్, అరుణ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రదానం



చిట్టిప్రోలు వెంకటరత్నం దంపతులను సత్కరిస్తున్న ఆవోపా సభ్యులు

పాత గుంటూరు: అరండల్‌పేటలో బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా విశేష సేవలందించిన ప్రముఖులకు ఉగాది పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముందుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నోరి నారాయణ మూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సభకు ఆవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావుకు జీవిత సాఫల్య పురస్కారం, ప్రముఖ రచయిత చిట్టిప్రోలు వెంకటరత్నానికి కవిరత్న పురస్కారం, మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మట్టుపల్లి సత్యనాగమోహన్‌కు ఉగాది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు టి.రాంబాబు, కార్యదర్శి వి.రాధాకృష్ణయ్య, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, బి.ఎల్.ఆదినారాయణ, డాక్టర్ పి.రాధాబాయి, కె.వి.ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

శోభకృత్ నామ సంవత్సరానికి సాదర స్వాగతం

- ఇంటింటా ఉగాది సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు



చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానం వద్ద పంచాగ శ్రవణం చేస్తున్న అర్చకులు



పెదకాకాని శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న స్థానాచార్యులు సాంబశివరావు



పెదకాకాని శివాలయంలో శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు



తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు, సభ్యులు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ధర్మచరణ్ తదితరులు

చేబ్రోలు : మండలంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటా వేడుకల సందడి నెలకొంది. అన్ని దేవాలయాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణం జరిపారు. ఖ్యాతిగాంచిన చేబ్రోలులోని ప్రధాన దేవాలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణం చేశారు. నాగేశ్వరస్వామి దేవస్థానంలో సంస్కృత పండితులు నారాయణం శేషబాబు ఆచార్యులు ఆయా రాశుల వారికి ఈ ఏడాది ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం, అవమానాల వివరాలను తెలియజేశారు. జీవితంలో లాభం, నష్టం, సుఖం, కష్టం, ఇష్టం, అయిష్టం అనుభూతల ప్రతీకే ఉగాది పచ్చడి అని వివరించారు. రాశి ఫలాలు, రైతులకు పంటలు తదితర వాటి గురించి తెలియజేశారు. శుభకృత్ నామ సంవత్సరం కంటే శోభకృత్ నామ సంవత్సరం అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆయన వివరించారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి, శ్రీరంగపురం, శేకూరు, శలపాడు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

పెదకాకాని శివాలయంలో వేడుకలు

పెదకాకాని: ప్రజలందరికీ శోభకృత్ నామ సంవత్సరం అనుకూలంగా, యోగ్యంగా ఉంటుందని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు తెలిపారు. పెదకాకాని శివాలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సరం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం శోభకృత్ నామ సంవత్సరం, ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సర రాశి ఫలితాలు, వర్షాభావ పరిస్థితులు, పాడి పంటలు, విద్య, వ్యాపార అనుకూలత వంటి అంశాలపై ఆయన పంచాగ శ్రవణం చేశారు. అనంతరం భక్తులందరికీ శోభకృత్ నామ పంచాగం, ప్రసాదాల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు పేటేటి ధనమహేశ్వరప్రసాద్, చదలవాడ జాలయ్య, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శంకర మఠంలో ఉగాది వేడుకలు

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని శ్రీ శంకరమఠంలో బుధవారం బ్రాహ్మణ బజారులోని బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణపవరపు రామశాస్త్రి పంచాగ శ్రవణం చేశారు. రాశి ఫలాలు, ఆదాయ వ్యయాల్ని వివరించారు. అనంతరం బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను మహాసభ అధ్యక్షుడు సీపీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి. శ్రీనివాసరావు, తిలక్ పాల్గొన్నారు.

గోరంట్ల శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: తెలుగు ప్రజలంతా ఈ ఏడాది శ్రీ వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు, సుఖసంతోషాలతో జీవించాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ఆకాంక్షించారు. గోరంట్ల శ్రీ వేంకటేశ్వరాలయంలో బుధవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మచరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్, ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత మాణిక్యవేల్, స్థానిక కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మ, యర్రంశెట్టి సూరి, గుడి సతీష్‌కుమార్, గాజుల సాయిరాం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహనులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండ

పెదనందిపాడు: శాలివాహనులకు (కుమ్మర్లు) ప్రభుత్వం అన్ని విధాలుగా అండంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ చీమకుర్తి లోకేష్ తెలిపారు. పెదనందిపాడులో బుధవారం జరిగిన శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాలివాహనుల చేతివృత్తిని బలోపేతం చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, జగనన్న చేదోడు పథకం వారికి వర్తిస్తుందని చెప్పారు. శాలివాహన చక్రవర్తి గొప్పతనం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం శాలివాహన చక్రవర్తి జయంతి కేకును కట్ చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ మండల అధ్యక్షుడు చల్లగిరి శ్రీనివాసరావు, సభ్యులు కానుగల నాగభూషణం, పకీరరావు, సాయిబాబు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: మల్లవరం పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 23 వేలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేబ్రోలు: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం సైకిల్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో బుధవారం జరిగింది. మండల కేంద్రమైన చేబ్రోలుకు చెందిన వృద్ధుడు మురికిపూడి ప్రసాద్ సైకిల్‌పై నారాకోడూరు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ సమయంలో నారాకోడూరు తెనాలి రోడ్డులోని మలుపు వద్ద స్కూటీపై వేగంగా వస్తున్న యువకులు ఢీ కొట్టారు. ఈ సంఘటనలో వృద్ధుడు ప్రసాద్ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. స్కూటీపై ఉన్న గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు సాయికృష్ణ, రాఘవ కూడా గాయపడ్డారు. స్కూటీ ముందు భాగం దెబ్బతింది. ముగ్గురిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు చర్యలు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు, గదులకు తలుపులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌కు పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యపై స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సొంత నిధులతో పాఠశాల టాయిలెట్లు, గదులకు తలుపులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

ఫిజియోథెరఫీతో నొప్పులు మాయం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శివకుమార్, డాక్టర్ హిమబిందు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలితో అనేక మంది నేడు పలు రకాల నొప్పులతో బాధపడుతున్నారని, ఆపరేషన్లతో పని లేకుండా వాటిని ఫిజియోథెరఫీతో నయం చేయవచ్చని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ ఇంజూరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్ తెలిపారు. స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్, పలకలూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన షైనీస్ ఫిజియోథెరఫీ క్లినిక్‌ను బుధవారం డాక్టర్ శివకుమార్, న్యూరాలజిస్టు డాక్టర్ హిమబిందు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలతో బాధపడుతున్న చిన్నారులకు ఫిజియోథెరఫీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో క్లినిక్ నిర్వాహకురాలు బుర్రి అరుణ, రెవరెండ్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ హృదయ రంజన్ పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టం



రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవని ప్రభుత్వ పాఠ్య పుస్తక డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలో భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక సేవా కార్యక్రమాల దిశగా ప్రోత్సహిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ మన సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా మంచి కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఉప్పాల రామ్మోహనరావు, బీఎస్‌జీ జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఈ.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు టి.అంకమ్మరావు, సుబ్బారావు, మాలకొండయ్య, ఏపీసీఓసీ జిల్లా అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడండి



తెనాలిఅర్బన్: భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా ఉపయోగించాలని 22వ బెటాలియన్ అధికారి సుబేదార్ దేవందల్, హవల్దార్ కపిల్‌దేవ్‌లు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నీటి లభ్యతను, దానిని పొదుపుగా వాడే విధానాన్ని ప్రజలకు తెలియజేశారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎ.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ వి.రమేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.నవీన్‌రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సువార్త సభలు

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు సువార్తసభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.జాన్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాక్యోపదేశకులుగా గుంటూరుకు చెందిన డాక్టర్ యల్.క్లారెన్స్ శాస్త్రి, కె.నెహెమ్యా, గాయకుడు దియ్యాప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. విశ్వాసుల పాల్గొనాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలి టౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా ఆంజనేయం ధ్యాన యోగమండలి ఆధ్వర్యంలో రత్నాటాకీస్ సెంటర్‌లోని రైతుబజారులో బుధవారం తులసి ఆకుల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యోగాచార్యులు కిశోర్ గురూజీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి తాడిబోయిన శివరామకృష్ణ ప్రజలకు తాగునీరందించారు. ఈ సందర్భంగా కిశోర్ గురూజీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది పర్వదినం రోజున తులసి ఆకులు, లవంగం పొడి కలిపి మట్టికుండలో భద్రపరిచిన మినరల్ వాటర్‌ను బాటసారులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. యోగ సభ్యులు పురుషోత్తమ కృష్ణస్వామి, చెంచయ్య స్వామిల వితరణతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, గుప్తా స్వామీజీ, ముంతా శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, సుబ్బారావు, సుజాత, ప్రసాద్, శాంతి పాల్గొన్నారు.

కళాకారుడు వసంతరాయుడుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం స్త్రీజన్మ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం జీవితచక్రం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు బొమ్మిడి వీరభోగ వసంతరాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేజళ్ల ఉమామహేశ్వర్, గడ్డిపాటి బాలచంద్రకుమార్, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.